క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కూడేరు: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి లక్షాధికారులను చేయాలన్నదే 'లఖుపతి దీదీ' లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆదివారం మహారాష్ట్రలో 'లఖుపతి దీదీ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూడేరులోని వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘ సభ్యురాళ్లకు ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేలా ఏర్పాటు చేశారు. మహిళలు పొదుపును పాటించాలని, ఆర్థికంగా ఎదగడానికి ఏ విధంగా చర్యలు చేపట్టాలో పీఎం వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, విజేత మండల సమాఖ్య అధ్యక్షురాలు వసంత, ఏపీఎం రాజశేఖర్, వెలుగు సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

శెట్టూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఏపీఎం సర్దానప్ప అన్నారు. ఆదివారం మండలంలోని వెలుగు కార్యాలయంలో లఖుపత్ దీదీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి తెగిన కల్వర్టు



జె.వెంకటంపల్లికి వెళ్లే దారిలో తెగిన కల్వర్టు

గుమ్మఘట్ట: మండలంలోని జె.వెంకటంపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్ట్ వర్షం దెబ్బకు కొట్టుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు పూర్తిగా దెబ్బతినింది. దీంతో ప్రజలు, వాహన రాకపోకలకు అంతరం కలిగింది. ఈ విషయంపై పీఆర్ ఏఈ లక్ష్మీనారాయణను అడగ్గా క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు చేపడతామన్నారు.

లయన్స్ క్లబ్ అనంతపురం రీజినల్ చైర్మన్‌గా నూర్‌మహ్మద్



లయన్స్ క్లబ్ అనంతపురం రీజినల్ చైర్మన్ గా ఎంపికయిన నూర్ మహ్మద్

ఉరవకొండ: అనంతపురం జిల్లా లయన్స్ క్లబ్ శాతవాహన రీజన్ చైర్మన్గా ఉరవకొండకు చెందిన లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ పీజీఎస్ నూర్‌మహ్మద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరులో వివిధ జిల్లాల రీజినల్ చైర్మన్ల ప్రమాణస్వీకారం జరిగింది. ఇందులో అనంతపురం జిల్లా రీజన్ చైర్మన్‌గా పీజీఎస్ నూర్‌మహ్మద్ బాధ్యతలు చేపట్టారు.

28న భూబాధితుల అవగాహన సదస్సు

రాయదుర్గంటౌన్: ఈ నెల 28న విజయవాడలో జరిగే భూ బాధితుల అవగాహన సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కొత్రేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భూ బాధితుల అవగాహన సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గురుస్వామి, దుర్గన్న, కుమార్, తిప్పేరుద్ర, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



మరుగుదొడ్డి నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

కుందుర్పి: కుందుర్పిలో మాజీ ఎంపీ తలారి రంగయ్య చొరవతో పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణానికి మోక్షం లభించింది. గత మార్చి నెలలో ఎంపీ నిధుల కింద కుందుర్పి కిందిగేరి బస్టాండ్ వద్ద, ఐకేపీ కార్యాలయం వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12 లక్షలు విడుదల చేశారు. స్థానిక సర్పంచ్ మూరుతేశ్వరీ గ్రామస్తుల పర్యవేక్షణలో వారం రోజులుగా మరుగుదొడ్ల నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ప్రక్రియను నిలిపివేయాలి

రాయదుర్గంటౌన్: రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లు, నివాస గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగి రాష్ట్రంలో నివాస గృహాలకు విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంప్ సెట్లకు మీటర్లు పెట్టాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్రజలు, రైతులను మోసం చేస్తున్నట్లు చెప్పారు.



మహిళా వైద్యుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

రోగులకు నిస్వార్థంగా సేవలందించే మహిళా వైద్యులపై దాడులకు దిగిన, ఆఘాయిత్యాలకు పాల్పడినా నేరస్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి. మహిళా వైద్యుల్లో ఆత్మస్థైర్యం నింపాలి. మహిళా వైద్యుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకురావాలి.

– డాక్టర్ మస్రత్‌జహ, వైద్యాధికారిణి, ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి



మహిళా వైద్యులకు భద్రత, భరోసా కల్పించాలి

కోల్‌కతా ఘటనతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లోని వైద్యులు, వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. ఎవరైనా దాడులు చేసినా కఠిన శిక్షలు అమలు చేయాలి. సుప్రీం కోర్టు సూచనలు పరిగణనలోకి తీసుకోవాలి. తద్వారా వైద్యులు, సిబ్బందికి మనోధైర్యం కల్పించాలి. ఆస్పత్రి సమస్యలపై దృష్టి సారించాలి. ముఖ్యంగా మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బంది భద్రతకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

– పి.మాధవి, వైద్యాధికారి, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి



అమాత్యుడి ఆదేశాలు అమలయ్యేనా?

- ఎస్‌ఎస్ ట్యాంకుల్లో నత్తనడకన నీటి పంపింగ్
- ఆరు మోటార్లతో 10 శాతం కూడా నిండని ట్యాంకులు
- భవిష్యత్‌లో పొంచి ఉన్న నీటి ఎద్దడి



నింబగల్లు వద్ద 10 శాతం కూడా నిండని మొదటి ట్యాంకు



హెచ్చెల్సీ ద్వారా నత్తనడకన సాగుతున్న నీటి పంపింగ్

ఉరవకొండ: ఉరవకొండలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి అవసరమైన పక్కా ప్రణాళికతో ముందకెళ్తామని, యుద్ధప్రాతిపదికన ఎస్‌ఎస్ ట్యాంకులను నింపుతామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జూలై 28న నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకుల పరిశీలన సమయంలో ఉన్నతాధికారుల సమక్షంలో వెల్లడించారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం నీటి పంపింగ్ నత్తనడకన సాగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉరవకొండ పట్టణం, గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడ్డారు.

నీటి పంపింగ్‌పై నిర్లక్ష్యం..

నింబగల్లు ఎస్‌ఎస్ ట్యాంకుల ద్వారా ఉరవకొండ పట్టణంతో పాటు నింబగల్లు, రేణుమాకుపల్లి, వ్యాసాపురం, రాయంపల్లి, బూదగవి, వెలిగొండ, నెరిమెట్ల గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. పట్టణంతో పాటు అన్నీ గ్రామాలకు కలిపి రోజుకు 23 లక్షల నీటిని సరఫరా చేస్తారు. ఇక్కడ మూడు ట్యాంకులు ఉండగా 40 హెచ్‌పీ సామర్థ్యం కలిగి 6 మోటార్లు వినియోగించి హెచ్చెల్సీ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. నీటి పంపింగ్ ప్రారంభించి నెల రోజులవుతున్నా 10 శాతం కూడా ట్యాంకు నింపలేకపోయారు. దీనికి తోడు తరచూ పైప్‌లైన్‌లు పగలిపోవడం నీటి పంపింగ్‌కు తీవ్ర ఆటంకంగా మారుతోంది. ఈనేపథ్యంలో ఆర్థికశాఖ మంత్రి కేశవ్ ఆదేశాలు అమలయ్యేనా? అన్న సందేహాలు ఉత్పన్నవుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూడా నీటి పంపింగ్‌పై నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో అదనంగా ట్రాక్టర్లతో నీటి పంపింగ్

తాగునీటి ఎద్దడి నివారించడానికి వైఎస్సార్‌సీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక చొరవతో ఆరు ట్రాక్టర్లతో నీటి పంపింగ్ చేయించారు. దీనికి తోడు ఉరవకొండలో ప్రతి వార్డులో సిస్టం ట్యాంకులు ఏర్పాటు చేయించారు. అవసరమైన చోట ట్యాంకర్లతో నీరు సరఫరా చేశారు. ప్రస్తుతం ఎస్‌ఎస్ ట్యాంకుల్లో ఉన్న మూడు ట్యాంకుల్లో మొదటి ట్యాంకు సామర్థ్యం 15 అడుగులు కాగా, మొదటగా ఈ ట్యాంకులో పంపింగ్ చేపట్టారు. నెలరోజులవుతున్నా కేవలం 5 అడుగులు మాత్రమే నింపారు. మిగితా బండల చెరువు ట్యాంకు 18 అడుగులు, మూడో చెరువు 16 అడుగుల సామర్థ్యం ఉంది. వీటిని నింపడానికి ఇంకా నాలుగు నెలల సమయం పడుతుంది. ఈయేడాది తుంగభద్ర జలాశయంలో 19వ గేటు గల్లంతు అయి నీరు పెద్ద ఎత్తున వృథాగా సముద్రం పాలైంది. దీంతో హెచ్చెల్సీకి నీరు రెండు నెలలు కూడా వచ్చే అవకాశం ఉండదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా మంత్రి కేశవ్ ప్రత్యేక చొరవ చూపి తాగునీటి పంపింగ్ వేగవంతంగా జరిగేలా అధికారులను ఆదేశించి, అదనపు మోటార్లు, ట్రాక్టర్లు పెట్టి నీటి పంపింగ్ జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి పంపింగ్ వేగవంతం చేస్తాం



ఎస్‌ఎస్ ట్యాంకుల్లో వేగవంతంగా నీటి పంపింగ్ జరిగేలా పర్యవేక్షిస్తున్నాం. మంత్రి ఆదేశాల మేరకు ఆరు మోటార్లతో పంపింగ్ చేపట్టాం. ఎన్ని అవరోధాలు ఎదురైనా వాటిని అధిగమించి మూడు చెరువులు నింపేందుకు కృషి చేస్తున్నాం.

– అంజుమన్ నస్రీన్, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉరవకొండ

'సత్యసాయి' కార్మికుల సమ్మెతో నీటి సమస్య



కొనకొండ్లలో నిరసన తెలుపుతున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

వజ్రకరూరు: కొనకొండ్లలోని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారంతో నాలుగోరోజుకు చేరింది. దీంతో నాలుగురోజులుగా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తింది. మండలంలో ఎనభై శాతం ప్రజలు సత్యసాయి తాగునీటిపైనే ఆధారపడతారు. సత్యసాయి కార్మికులు మాట్లాడుతూ ఆరునెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యలు పరిష్కరించరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి కార్మికులు జయన్న, భీమేష్, చెన్నయ్య, బాబు, వెంకటాద్రి, యాకోబ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

ఉరవకొండ: సమస్యల పరిష్కారానికి ఉద్యమానికి సిద్ధం కావాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అధికారులు, నాయకులు చుట్టూ ఎస్సీ, ఎస్టీలు సమస్యలు పరిష్కరించాలని తిరిగినా, పట్టించుకోలేదన్నారు. నేటికీ శ్మశాన వాటికలు లేక ఎస్సీ, ఎస్టీలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చాబాల సురేష్, దాసరి రామాంజనేయులు, రాకెట్ల సూరి, మారెప్ప, లక్ష్మన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారం

ఉరవకొండ: ఉరవకొండ క్లాక్‌టవర్ ప్రధాన రహదారి వద్ద వాహనదారులు, పాదచారులకు మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ కృషి ఫలితంగా ట్రాఫిక్ కష్టాలు తప్పాయి. రెండు నెలలుగా ఈఓ, పోలీసుల సహకారంతో క్లాక్‌టవర్ చుట్టూ తోపుడు బండ్లు, చిరువ్యాపారులకు అవగాహన కల్పించి, ట్రాఫిక్‌కు సహకరించాలని తెలియజేశారు. దీంతో చిరువ్యాపారులు క్లాక్‌టవర్ చుట్టూ కాకుండా రోడ్డు అవతల వ్యాపారులు పెట్టుకోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

నేమకల్లు అంజన్నకు పూజలు



బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. స్వామివారికి గంగపూజ, గోపూజ, వాసుదేవ పుణ్యాహవాచనం, పంచగావ్య మేళనం, రిత్విక్ గర్వనం, ప్రధాన దేవతల కలశ స్థాపన మండప ఆధారన, మహామంగళ హారతి పూజలు చేశారు.

28న కొల్హాపూర్ అమ్మవారి వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమ ప్రాంగణంలో కొలువుదీరిన కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 28న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ప్రతినిధి విజయ్‌కుమార్ తెలిపారు. మహాగణపతి పూజలు, శ్రీలక్ష్మీ నారాయణ హోమం, దేవతామూర్తుల అభిషేకాలతో పాటూ 11 మంది మహిళలకు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

'ఉపాధి' సిబ్బందికి రూ.21 వేల జరిమానా



సామాజిక తనిఖీ వివరాలను వెల్లడిస్తున్న డీఆర్పీ, వీఎస్‌ఏలు

కణేకల్లు: ఉపాధిహామీ కూలీల మస్టర్‌లో తప్పిదాలతోపాటు రికార్డుల్లో పనులు, బిల్లుల చెల్లింపు వివరాలు సక్రమంగా లేకపోవడంతో ఉపాధిహామీ సిబ్బందికి అదనపు పీడీ ఆర్.సుధాకర్‌రెడ్డి రూ.21 వేలు పెనాల్టీ వేశారు. అదేవిధంగా వివిధ పనుల్లో బిల్లుల చెల్లింపుల్లో లెక్కల్లో తప్పిదాలుండడంతో రూ.19,756లు రికవరీ చేయాలని ఆయన ఆదేశించారు.ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి డ్వామా ఏపీడీ ఆర్.సుధాకర్‌రెడ్డి, రాయదుర్గం ఏపీడీ ఆయిషా, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించిన డీఆర్పీ, విలేష్ సోషల్ ఆడిటర్లు తనిఖీల్లో వెలుగు చూసిన విషయాలను ప్రజావేదికలో వెల్లడించారు. డ్రై ల్యాండ్ హార్టికల్చర్ స్కీమ్ కింద రైతుల పొలాల్లో నాటిన మొక్కలు డ్రై అయినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. రచ్చుమర్రిలో ముగ్గురు రైతుల పొలాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద 1,170 మొక్కలు నాటితే కొన్ని నెలలకే ఎండిపోయాయని డీఆర్పీ ప్రమీళ అధికారుల దృష్టికి తెచ్చారు. జక్కలవడికిలో ఓ రైతు పొలంలో 139 మొక్కలు నాటారని, అవి కూడా ఎండిపోయినట్లు డీఆర్పీ చంద్రకళ తెలియజేశారు. కార్యక్రమంలో డ్వామా విజిలెన్స్ విభాగం సీనియర్ అసిస్టెంట్ పర్వేష్, ఎస్ఆర్పీ మీరావలీ, ఏపీఓ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు నరసింహాచారి, సోమన్నగౌడ్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో అంధకారం



కరెంటు లేని సమయంలో సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో రోగులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కరెంట్ సరఫరా లేని సమయంలో రాత్రిపూట రోగులు, నర్సులు అంధకారంలో గడపాల్సిన పరిస్థితి. ఒకవైపు రోగులకు చికిత్సలు అందించడమే కాక ఆస్పత్రి పై అంతస్తులో ఒక్కలైట్ కూడా ఉండదు. చీకట్లో నర్సులు ఉండలేక భయపడాల్సి వస్తోంది. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన యూపీఎస్ బ్యాటరీ కేవలం రెండు గంటల పాటు బ్యాకప్ వస్తుంది. ఈ బ్యాటరీతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో లేబర్ రూము, మహిళా చికిత్స విభాగంలో మాత్రమే కరెంటు ఉంటుంది. కరెంటు కట్ అయితే పైఅంతస్తులో పూర్తిగా అంధకారమే.కరెంటు కోత ఉన్న సమయంలో పైఅంతస్తులో వెళ్లి సేవలందించేందుకు నర్సులు జంకుతున్నారు. ఒక్కోరోజు రెండు గంటలకుపైగా కరెంట్ కోత ఉండే సమయంలో యూపీఎస్ బ్యాటరీ బ్యాక్ అప్ పూర్తయితే ఇక ఆస్పత్రి అంతటా చీకట్లో ఉండాల్సిందే. దాదాపు రూ.30 లక్షల విలువైన పవర్ జనరేటర్ అందుబాటులో ఉన్నా దాన్ని వినియోగంలో తెచ్చేందుకు ఆస్పత్రి అధికారులు శ్రద్ధచూపడంలేదు. ఔట్ పోస్ట్ ఉన్నా రాత్రిపూట సిబ్బంది ఎవరూ ఉండరు. సెక్యూరిటీ గార్డులు మాత్రమే ఉంటారు. ఈ సెక్యూరిటీ గార్డుల్లో కూడా కొందరు అందుబాటులో ఉండరనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



నిత్యం రద్దీగా ఉండే ఆత్మకూరు వీధిలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



బీజీ తిలక్ హైస్కూల్ ప్రహరీకి ఆనుకొని జనవాసాల మధ్య ఇలా..



కణేకల్లు రోడ్డు నుంచి నేసేపేటకు వెళ్లే సర్కిల్‌లో ఇలా...

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. కనీసం రక్షణ కంచె కూడా ఏర్పాటు చేయకపోవడంతో అవి ప్రజల పాలిట మృత్యుఘంటికలుగా మారాయి. పట్టణంలో దాదాపు వందకుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటిని ప్రధాన, అంతర్గత రహదారులకు ఆనుకొని ఏర్పాటు చేయడంతో ప్రజలు, వాహనరాకపోకలకు ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉన్నాయి. జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడమేకాక కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా పట్టణంలోని కణేకల్లు రోడ్డు కళాశాల వద్ద, నేసేపేట పాండురంగ స్వామి గుడి వద్ద, బళ్లారి రోడ్డు, కోట ఏరియా, అత్మకూరువీధి, ఓబుళాచారీ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన, జనావాసాల మధ్య కంచెలేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ బాలును అడగ్గా, కంచెల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరయితే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తకోట వాగుకు ప్రొటెక్షన్ వాల్ నిర్మించండి

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి తూర్పు దిశగా ఉన్న కోత్తకోట వాగుకు ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని ఎంపీపీ కమలమ్మ, గ్రామ సర్పంచ్ గంగాధర తదితరులు కోరారు. భారీ వర్షాలు పడిన సమయాల్లో అటవీప్రాంతం నుంచి వరద నీరు గ్రామంలోకి రావడంతో పక్కా ఇళ్లు ముంపునకు గురవుతున్నట్లు తెలిపారు. కొత్తకోట వాగు గతంలో కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా తెగిపోయిందన్నారు.

అపూర్వ సమ్మేళనం



29 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

కణేకల్లు: పట్టణంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1995–96 బ్యాచ్ విద్యార్థినులు పాఠశాలలో సమ్మేళనమయ్యారు. అందరూ ఒకే వేదిక్పై కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులు రహమత్‌బీ, ఫజులున్నీషా, నారాయణస్వామి, నారాయణరెడ్డిని సన్మానించారు.

చెరువులు,కుంటలకు జలకళ



వజ్రకరూరు వద్ద నిండిన చెట్టుకుంట

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో కుంటలు, చెరువులు నిండు కుంటలను తలపిస్తున్నాయి. ఇటీవల మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో గ్రామాల్లో ని చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపునీరు చేరుకుంది. మండల కేంద్రం వజ్రకరూరు లోని పురాతన బావులన్నీ వర్షపునీటితో నిండాయి. ఇదే గ్రామంలోని చెట్టుకుంట, భూమిరెడ్డి కుంటలు కూడా వర్షపు నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలోని వెంకటాంపల్లి, జరుట్లరాంపురం చెరువులకు కూడా భారీగా వర్షపునీరు చేరుకోవడంతో నిండుకుండలను తలపిస్తున్నాయి.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వజ్రకరూరు: స్థానిక కురుబ వీధిలోని నీలగిరి స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, మహా మంగళహారతి, విశేష పూజలు నిర్వహించారు.

'దుర్గం'లో జూదం జోరు

- టీడీపీ నాయకుల కనుసన్నల్లో పేకాట నిర్వహణ
- శంబులింగకొండ కేంద్రంగా చేతులు మారుతున్న రూ.40 లక్షలు
- సరిహద్దు ప్రాంతాల్లో విస్తరిస్తున్న పేకాట శిబిరాలు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న పోలీసులు



పేకాట రాయుళ్ల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

రాయదుర్గం: రాయదుర్గం పరిసరాల్లో వందలాది కుటుంబాల జీవితాలను ఛిన్నాభిన్నం చేసిన జూదం ..మళ్లీ జడలు విప్పింది. ఇటీవల సరిహద్దు ప్రాంతాల్లో పేకాట శిబిరాలు జోరందుకున్నాయి. టీడీపీ నాయకుల కనుసన్నల్లో పట్టణ పరిహద్దులోని శంబులింగకొండ ప్రాంతంలో నిత్యం రూ.40 లక్షలకు తగ్గకుండా చేతులు మారుతోంది. రోజువారి సంపాదన రూ.లక్షల్లో ఉండడంతో నిర్వాహకులు సిండికేట్‌గా మారి, మండలాలకు జూదం విస్తరించేలా చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జూదరులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మళ్లీ పేకాట స్థావరాలు జోరందుకున్నాయి. పట్టణ పరిసర గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున పేకాట కేంద్రానికి వస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు.

ఎస్‌ఓజీ పోలీసులకు చిక్కిన పేకాట రాయుళ్లు

పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక పోలీసులకు తెలిసినా ఒత్తిళ్లకు తలొగ్గి అటువైపు కన్నెత్తి చూడలేదు. ఎస్పీ జగదీష్ బాధ్యతలు తీసుకోగానే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపారు. జిల్లాలో పేకాట కేంద్రాలు, జూదరులు, నిర్వాహకుల కదలికలపై నిఘా పెట్టారు. స్థానిక పోలీసులకు తెలీకుండా ఎస్‌ఓజీ టీమ్‌ను రంగంలోకి దింపారు. దీంతో రాయదుర్గం పరిసరాల్లో శనివారం ఎస్‌ఓజీ టీమ్ జరిపిన ఆపరేషన్‌లో పేకాట శిబిరాల గుట్టు రట్టయ్యింది. శంబులింగకొండ, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకొని దాడులు నిర్వహించారు. సుమారు 22 మంది పేకాట రాయుళ్లు, 21 ద్విచక్ర వాహనాలు, 21 సెల్‌ఫోన్లు, రూ.43,210 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఎక్కువ శాతం టీడీపీ సానుభూతిపరులు ఉండడం విశేషం. కాగా కొందరిని తప్పించేందుకు అధికార పార్టీ నేతలు చివరి క్షణం వరకు ప్రయత్నాలు సాగించినట్టు తెలిసింది. పేకాట శిబిరం వద్ద పోలీసులు దాడులు నిర్వహిస్తుండగానే అసలు సూత్రదారులు కొందరు తప్పించుకున్నట్టు చర్చసాగుతోంది. ఇదిలా ఉండగా టీ వీరాపురం, బొమ్మనహాళ్, కణేకల్లు, డి హీరేహాళ్, గుమ్మఘట్ట మండలాల్లోనూ పలు ప్రాంతాల్లో పేకాట పుంజుకుంది.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

ఇటీవల రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టాను. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మట్కా, పేకాట లాంటి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపం. అర్బన్ పరిసరాల్లో పేకాట ఆడుతూ కొందరు పట్టుబడ్డారు. వారందరిపైనా కేసులు నమోదు చేశాం. ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎవరూ బాధ్యులు ఉన్నా వదిలిపెట్టేది లేదు. సరిహద్దు ప్రాంతాల్లోనూ అన్ని మండలాల్లోనూ దీనిపై ప్రత్యేక నిఘా ఉంచాం.

– వెంకటరమణ, సీఐ, రాయదుర్గం

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

కూడేరు: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ శివరాముడు హెచ్చరించారు. ఆదివారం ఆయన కూడేరు మండల పరిధిలోని కొర్రకోడు డ్యాం రోడ్డుపై , జల్లిపల్లి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు.